# ఏడుపుగొట్టు కథల పోటీలో రెండో బహుమతి పొందిన కథ

"ఏమండీ, మృదులగారూ! ఇదిగోండి మీ హారం" అంటూ పెరటి గోడవతలనుండి కేకవేసింది కస్తూరి.

"నేనే మీ ఇంటికి వద్దామనుకుంటు న్నానండీ. ఎదురింటి మీనాక్షి గారమ్మాయికి 'ఎంగేజ్‌మెంటు' కదా! ఆఫీసు నుంచి మావారు కూడా వచ్చే వేళయింది— నేను రెడీగా వుండకపోతే కోప్పడతారు ..."

"నేనూ ఇప్పుడే షాపింగ్ చేసి వచ్చి, 'స్టౌ' మీద పాలు పడేసి ఇటొచ్చాను. మేంకూడా మీనాక్షిగారి ఫంక్షన్ కెళ్ళాలి కదా! తయారవ్వాలి— ఇదిగోండి మీ చంద్రహారం" అంటూ అతి జాగ్రత్తగా ఆ గొలుసున్న ప్లాస్టిక్ కేస్‌ను అందించింది.

"అవునూ! కిటికీలూ— తలుపులూ మూసేసుకున్నారూ ..."

"ఈ మధ్య ఓ మాయదారి పిల్లిముండ దాపురించింది కదండీ, పాలూ — పెరుగూ— ఏవీ బ్రతక నీయడం లేదు. మీకైతే 'ఫ్రిజ్' వుంది— అందులో హాయిగా పెట్టేసుకుంటారు" అంది అక్కసుగా కస్తూరి.

"వస్తానండీ!" అంటూ వెనుదిరగబోతున్న మృదులతో—

"ఈ చంద్రహారాన్ని మీకివ్వడానికి వారం పది రోజులు లేటు చేసిందానికి మరేమీ అనుకోకండేం! ఇంతకీ దీన్నెంతకి చేయించారు!" అంది కస్తూరి.

"ఇది చేయించి రెండేళ్ళ పైన్నే అయ్యిందండీ! అప్పుడే పదివేల రూపాయలపైన అయింది."

"అమ్మో! పదివేలే!" అంది గుండెలపైన చేయి వేసుకుని అమాయకంగా. లోపల మాత్రం— ఆ 'పదివేల' చంద్రహారం— తన స్వంతం అయిపోయిందని సంతోషంతో గంతులేయసాగింది కస్తూరి మనసు.

ఇప్పుడు మృదులకిచ్చిన చంద్రహారం నకిలీదనీ అసలు గొలుసును తను దాచేసి అలాంటిదే 'రోల్డ్ గోల్డ్' వగ తెచ్చిందనీ ఈ డిజైన్ వున్న హారం కోసం ప్రతి షాపుముట్టూ కుక్కలా తిరిగి — తిరిగి ఇప్పటికి తేగలిగిందనీ అందువల్లనే తనకిన్ని రోజులు పట్టిందనీ పాపం ఆ మృదులకేం తెలుసు.

కస్తూరికిదేం క్రొత్తగాదు— ఇదివరకిలాగే మృదుల చేయించుకున్న బుట్టజుంకీలను తన శ్రీవారికి చూపించి తెస్తానని చెప్పి వెంటనే బజారెళ్ళి అలాంటివే 'రోల్డ్ గోల్డ్‌లో' కొనుక్కుని వచ్చి మృదులకిచ్చేసింది.

మృదుల ఈ నగల్ని రెగ్యులర్‌గా 'యూజ్' జేయదు కాబట్టి కస్తూరి ఇయ్యగానే వాటిని బీరువాలో జాగ్రత్త చేసేది.

"మృదులగారూ! మీనాక్షిగారి ఫంక్షన్‌కు ఏం చీర కట్టాలనకుంటున్నారూ!" అంది కస్తూరి యాంగ్జయిటీగా.

"అన్నట్టు — మీకు చెప్పలేదు కదూ నిన్ననే 'ఆంధ్రభూమి' వాళ్ళు నాకు వెయ్యి రూపాయలు "పట్టు చీర"ను పంపారు అదిప్పుడు కట్టుకుందామని ..."

"ఆంధ్రభూమి' మీకు చీర పంపడమేమిటండీ వాళ్ళు మీకేమైనా చుట్టాలా!" అంది ఈర్ష్యగా కస్తూరి.

ఆ మాటకు ఫక్కున నవ్వింది మృదుల "ఆంధ్రభూమి వీక్లీలో బాంబినో వెర్మిసెల్లిని వాళ్ళు వంటల పోటీ పెట్టి చీరల్ని బహుమతులుగా ఇస్తున్నారు. అందులో నేను రాసిన వంటకానికి ఫస్ట్ ప్రైజ్ వచ్చిందని వాళ్ళు పట్టుచీర పంపారు ...

"అలాగా! ఒక్కసారి ఆ చీరను చూపించరా!" అంది ఉడుక్కుంటూ కస్తూరి.

"ఉండండి" ఇప్పుడే తెస్తానంటూ లోపలికెళ్ళింది మృదుల.

'స్టౌ' మీద పాలు పెట్టిన సంగతి పూర్తిగా మరచిపోయింది కస్తూరి. అప్పటికే పాలన్నీ పొంగి 'స్టౌ' ఆరిపోయి గ్యాసంతా 'లీక్' అయిపోసాగింది.

పట్టుచీర ప్యాకెట్‌ను చూడగానే కస్తూరిలో 'జెలసీ' బుస్సున పొంగింది. ఆ చీరను చూస్తూ ఆలోచించ సాగింది.

అబ్బ ఎంత బాగుందీ చీర! ఈ చీరను కట్టుకుని మృదుల ఆ ఫంక్షన్ కెళ్ళిందంటే అందరి కళ్ళూ దీనిపైనే! ఇక తను ఈ చీర గురించీ తన వంటకం గురించీ— ఆ పత్రిక గురించీ గొప్పగా చెప్తూంటే అందరూ చుట్టూ గుమిగూడి ఆసక్తిగా వింటూంటే అప్పుడు నేనూ — నా చీరా వెల వెల బోవు!

వీల్లేదు .... ఇప్పుడీ చీరను మృదుల కట్టుకోనీకుండా చేయాలి ఎలా! ...

ఈ చీరను ఎలాగైనా ఇంట్లోకి తీసుకెళ్ళి అగ్గిపుల్లలతో లోపల మడతలన్నీ తూట్లు తూట్లుగా కాల్చిపారేయాలి— అప్పుడింకెలా కట్టుకుంటుందీ చీరను. ఆతర్వాత నవ్వడిగినా నాకేం తెలుసు పోస్టులో అలాగే వచ్చిందేమో ఆ చీర అని బుకాయించవచ్చు.

"మృదులగారూ, ఈ చీరనిస్తారా మావారొస్తే చూపించి తెస్తాను" అంది అర్థిస్తున్నట్లు కస్తూరి.

"అలాగే!" అంది మృదుల.

"ఇదిగో క్షణంలో వచ్చేస్తాను కాస్త అగ్గిపెట్ట వుంటే ఇస్తారా!"

మృదుల తెచ్చిచ్చింది.

దాన్నందుకుని వడివడిగా ఇంట్లో కెళ్ళిపోయి అధాటున తలుపు గడియ వేసేసుకుంది.

కస్తూరి తొట్రుపాటును చూసి మృదుల నవ్వుకుంది తనేది తీసుకున్నా త్వరగా ఇవ్వదని తెలిసి వెయ్యి రూపాయల పట్టుచీర బదులు తను వాడని పాతపట్టుచీరను పాకెట్‌లో పెట్టి ఇచ్చింది.

అప్పటికే 'లీక్' అయిపోయిన గ్యాస్ ఇల్లంతా ముట్టుకుని వుంది. తనలోని ఆవేశంలో —ఆత్రుతలో — అవాపవను పసిగట్టలేక పోయింది కస్తూరి.

వెంటనే చీరను కాల్చడానికి అగ్గిపుల్లని గీచింది.

" .... .... .... "

(ఇక కస్తూరి ఎమయిందో చెప్పవవసరం లేదనుకుంటాను).

— పొట్టిముత్యాల వనజ

## ఏడ్చేవాళ్ళను ....




